
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
కాకినాడ
జిల్లా వార్తలు
శనివారం 7 సెప్టెంబరు 2024 | 5





గొల్లప్రోలు మండలం తాటిపర్తి కృష్ణుడి గుడి వద్ద ఏర్పాటు చేస్తున్న 8.5అడుగుల వినాయకుడి విగ్రహం



పిఠాపురంలో మట్టి విగ్రహాలు



కిర్లంపూడిలో జోరుగా సాగుతున్న పండ్ల కొనుగోళ్లు



ఏలేశ్వరం మార్కెట్‌లో పూల దండల విక్రయాలు



పిఠాపురంలో...



పిఠాపురం మార్కెట్‌లో పూల అమ్మకాలు



కాకినాడలో పత్రి కొనుగోళ్లు

జై..జై గణేషా..!!

ఎక్కడ చూసినా సందడి వాతావరణమే. గ్రామాలు, పట్టణాల్లో వీధులన్నింటికీ పండుగ శోభ వచ్చింది. చిన్నారులు, పెద్దలు, మహిళలు అందరూ వినాయక చవితిని ఉత్సాహంగా జరుపుకునేందుకు సన్నద్ధమవుతున్నారు. జిల్లాలో ఏ ప్రాంతంలో చూసినా రహదారులన్ని పూజాసామగ్రి, వినాయక విగ్రహాలు కొనుగోలు చేసే వారితో కిటకిటలాడాయి. నేడు వినాయక చవితి సందర్భంగా ప్రత్యేకంగా..


- మార్కెట్లకు వినాయకచవితి శోభ
- రహదారులు జనసంద్రం
- ఏర్పాటవుతున్న చవితి పందిర్లు

పిఠాపురం/కలెక్టరేట్(కాకినాడ), సెప్టెంబరు 6: జిల్లావ్యాప్తంగా శుక్రవారం వినాయక చవితి కోలాహం నెలకొంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత జరుగుతున్న తొలిపండుగ కావడంతో భారీ ఎత్తున నిర్వహించేందుకు సన్నాహాలు చేస్తున్నారు. కాకినాడ నగరంతోపాటు పిఠాపురం, సామర్లకోట, పెద్దాపురం, ఏలేశ్వరం, గొల్లప్రోలు, తుని పట్టణాలు, జిల్లాలోని అన్ని మండలాల్లో భారీగా చవితి పందిర్లు ఏర్పాటు చేస్తున్నారు. ఈ ఏడాది పర్యావరణానికి ప్రాధాన్యమిస్తూ మట్టి విగ్రహాలతోపాటు కొబ్బరి, తాటాకులతో పందిర్లు వేస్తున్నారు. పట్టణాలు, నగరాల్లోని వార్డులు, డివిజన్లల్లో, గ్రామాల్లో నవరాత్రి ఉత్సవాలు నిర్వహించేందుకు సన్నద్ధమవుతున్నారు. భారీ వినాయక విగ్రహాలను నిలపాలని భావిస్తున్నారు. చవితికి అవసరమైన పూజాసామాగ్రి, విగ్రహాలు, పండ్లు, పుష్పాలు కొనుగోలు చేసే వారికి మార్కెట్లు అన్ని బిజీబిజీగా మారాయి. చవితి ఉత్సవాల నిర్వహణకు సింగిల్ విండో పద్ధతిలో అనుమతులు ఇవ్వడంతో ప్రతి ఒక్కరూ దరఖాస్తులు చేసుకుని సులభతరంగా అనుమతులు తీసుకున్నారు. అధికారంలోకి వచ్చిన తర్వాతే ఇది తొలిపండుగ కావడంతో టీడీపీ, జనసేన, బీజేపీ నేతలు ఉత్సవాలను ఘనంగా నిర్వహించాలని నిర్ణయించుకున్నారు.

కాకినాడ నగరంలో భానుగుడి సెంటర్, బాలాజీచెరువు, సర్పవరం జంక్షన్, ఆర్టీసీ కాంప్లెక్స్, గాంధీనగర్, కరణంగారి జంక్షన్, జగన్నాథపురం, మెయిన్‌రోడ్డు, సినిమారోడ్డు, సంతచెరువు సెంటర్లో భారీ విగ్రహాలను ఏర్పాటు చేస్తున్నారు. మండపాలకు పెద్దఎత్తున విద్యుత్ అలంకరణ చేస్తున్నారు. గణపతివిగ్రహాలు రూ.2వేల నుంచి రూ.50 వేల వరకు ధరలు పలుకుతున్నాయి.

జోరుగా పత్రి అమ్మకాలు

వినాయక చవితిని పురస్కరించుకుని కాకినాడలో పత్రి అమ్మకాలు జోరుగా సాగాయి. శుక్రవారం ఉదయం నుంచి రాత్రి 10 గంటల వరకు పత్రి విక్రయాలు చేశారు. మామిడి, ఉసిరి, గరికి వంటి పత్రి విక్రయాలు. రూ.50కి పత్రి అమ్మకాలు జరిగాయి. అరటిపండ్లు డజను రూ.60, యాపిల్ డజను రూ.300లకు అమ్మారు. పాలవిల్లు, వినాయక వ్రతానికి సంబంధించిన పత్రి ధరలు పెరిగినట్లు భక్తులు చెప్తున్నారు. భక్తులు వర్షాన్ని సైతం లెక్క చేయకుండా బయటికి వచ్చి పత్రి కొనుగోలు చేశారు.



జగ్గంపేటలో ప్రతిష్ఠించేందుకు సిద్ధం చేసిన గణనాథుడు

నాలుగు దశాబ్ధాలుగా.. గణేష్ ఉత్సవాలు

- సొంత నిధులతోనే నిర్వహణ
- ప్రత్యేక దుస్తులతో పూజలు

కొత్తపల్లి, సెప్టెంబరు 6: కొత్తపల్లి పోలమ్మగుమ్మం సెంటర్‌లో నాలుగు దశాబ్ధాలుగా వినాయక ఉత్సవాలను నిర్వహిస్తున్నారు. ఇక్కడ యువకులే సొంతంగా నిధులు సమకూరుస్తారు. ఎవరైనా దాతలు ఇస్తే తీసుకుంటారు. గ్రామంలో ప్రత్యేక ఆకర్షణగా ఉండే గణనాథుని విగ్రహాన్ని ప్రతిష్ఠిస్తారు. ప్రతిరోజూ యూత్ సభ్యులే పూజలు నిర్వహిస్తారు. ఉత్సవాలు నిర్వహించే 9రోజులు యువకులు అందరూ తెల్లని దుస్తులు ధరిస్తారు. అనంతరం భారీ అన్నసమారాధన చేస్తారు.





డ్రెస్‌కోడ్‌లో కొత్తపల్లి గణేష్ ఉత్సవ కమిటీ యూత్

ఆకర్షిస్తున్న చాళుక్యుల కాలంనాటి.. వినాయక విగ్రహం

పెద్దాపురం, సెప్టెంబరు 6: మండల పరిధిలోని ఆర్‌బీ పట్నం గ్రామంలో చాళుక్యుల కాలంనాటి రాతి వినాయక విగ్రహం ప్రజలను ఎంతగానో ఆకర్షిస్తోంది. రాఘవమ్మ చెరువు గట్టుపై వేంచేసి ఉన్న ఈవిగ్రహం సుమారు 150 సంవత్సరాల కిందట జరిగిన తవ్వకాల్లో బయటపడినట్లు స్థానికులు చెబుతున్నారు. సుమారు 500 సంవత్సరాల క్రితం పాలించిన చాళుక్యులు కాలంనాటి విగ్రహంగా చారిత్రక ఆధారాలు చెబుతున్నాయి. చెరువులో నుంచి విగ్రహం బయటి పడిన తరువాత అక్కడే ఆలయాన్ని నిర్మించారు. నాటినుంచి నేటి వరకూ గణనాథుడు నిత్యం పూజలందుకుంటున్నాడు. చవితి వేడుకలకు ఆలయాన్ని సర్వాంగసుందరంగా ముస్తాబు చేశారు. అధిక సంఖ్యలో భక్తులు తరలి వచ్చి గణనాథుడిని దర్శించుకోవాలని కమిటీ సభ్యులు కోరుతున్నారు.



ఆర్‌బీ పట్నంలో చాళుక్యుల కాలంనాటి రాతి వినాయక విగ్రహం

కుండపోత వర్షం



పిఠాపురంలో కుండపోతగా కురుస్తున్న వర్షం



ప్రత్తిపాడులో భారీవర్షం పడుతున్న దృశ్యం



తుని మండలం తేటగుంట జాతీయ రహదారిపై కుండపోత వర్షం

పిఠాపురం/ప్రత్తిపాడు/తుని రూరల్/కొత్తపల్లి, సెప్టెంబరు 6: జిల్లాలో పలుచోట్ల శుక్రవారం భారీవర్షం కురిసింది. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకూ ఉక్కపోత వాతావరణం ప్రజలకు సతమతం కలిగించగా 12.30 గంటల సమయంలో ఒక్కసారి పిఠాపురం, కొత్తపల్లి, గొల్లప్రోలు, తుని, ప్రత్తిపాడు మండలాల్లో కుంభవృష్టి మాదిరిగా వర్షం పడింది. ఎడతెరిపి లేని వర్షంతో రహదారులన్నీ జలమయమయ్యాయి. ఎక్కడికక్కడ డ్రెయిన్లు పొంగిపొర్లాయి. సాయంత్రం వరకూ చినికులు కొనసాగాయి.

మూడు నెలలకే హడావుడా?

- వారంరోజులైనా సమయం ఇవ్వరా?
- గత ప్రభుత్వం కాంట్రాక్టర్లకు రూ.95వేలకోట్ల బిల్లులు బకాయిపెడితే అప్పుడు మాట్లాడలేదే
- వైసీపీపై అనపర్తి ఎమ్మెల్యే నల్లమిల్లి ఆగ్రహం
- గౌరవ వేతనాల జాప్యంపై జడ్పీటీసీల అసంతృప్తి
- వాకౌట్ చేస్తామనడంతో సరికాదన్న కూటమి ఎమ్మెల్యేలు
- తుపానులు, వరదలపై చర్చించాలని హితవు
- కూటమి ప్రభుత్వం వచ్చాకే స్థానిక సంస్థలకు గౌరవం
- రూ.1452కోట్ల ఆర్థిక సంఘం నిధులు నేరుగా జమ
- హర్షం వ్యక్తం చేసిన కూటమి ఎమ్మెల్యేలు
- కాకినాడలో వాడివేడిగా జడ్పీ సమావేశం







జడ్పీ స్థాయీ సంఘ సమావేశంలో పాల్గొన్న జడ్పీ చైర్మన్ వేణుగోపాల్, కాకినాడ కలెక్టర్ షాన్‌మోహన్, కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యేలు నానాజీ, నెహ్రూ

రావికంపాడు సమీపంలో తెగిన విద్యుత్ ఓహెచ్‌టీ లైన్లు

- విశాఖ-విజయవాడ మధ్య రైళ్ల రాకపోకలకు అంతరాయం
- సామర్లకోట నుంచి వెళ్లి పునరుద్ధరించిన ప్రత్యేక బృందం



పిఠాపురంలో నిలిచిన జన్మభూమి ఎక్స్‌ప్రెస్

పిఠాపురం/సామర్లకోట, సెప్టెంబరు 6: విశాఖ వైపు వెళ్లే రైళ్లకు శుక్రవారం రాత్రి అంతరాయం కలిగింది. పిఠాపురం-తుని మధ్యగల రైల్వేలైనులో రావికంపాడు సమీపంలో విద్యుత్ ఓహెచ్‌టీ కరెంటులైన్లుతెగిపోయాయి. దీనితో విశాఖపట్టణం వైపు వెళ్లే రైళ్లను సమీప రైల్వేస్టేషన్లలో నిలిపివేశారు. సమాచారం తెలిసిన వెంటనే సామర్లకోటనుంచి మొబైల్ ఎలక్ట్రిఫికేషన్ ట్రబుల్ షూట్ బృందం రావికం పాడు చేరుకుని తెగిపడిన ఓహెచ్‌ఆర్ కేబుల్‌ను పునరుద్ధరించింది. ఈ కారణంగా హౌరా వెళ్త న్న కోరమాండల్ ఎక్స్‌ప్రెస్ గొల్లప్రోలు వద్ద గంటసేపు నిలిచిపోయింది. సికింద్రాబాద్ నుంచి విశాఖపట్టణం వైపు వెళ్లే జన్మభూమి ఎక్స్‌ప్రెస్‌ను శుక్రవారం సాయంత్రం 5.41గంటలు నుంచి 6.53 గంటల వరకూ పిఠాపురంలో నిలిపివేశారు. మల్లవరం రైల్వేగేటువద్ద కోరమాండల్ ఎక్స్‌ప్రెస్ సాయంత్రం 5.11గంటలు నుంచి రాత్రి 7.02గంటల వరకూ నిలిచిపోయింది. ఇతర ఎక్స్‌ప్రెస్‌లు, గూడ్స్‌రైళ్లను ఎక్కడికక్కడ నిలిపివేశారు. సామర్లకోట రైల్వేస్టేషన్‌లో బెంగళూరు నుంచి గౌహతి వెళ్లే ఎక్స్‌ప్రెస్ 30 నిమిషాలు, నాందేడ్ ఎక్స్‌ప్రెస్ గంటపాటు నిలిచిపోయాయి. కేబుల్ పునరు ద్ధరణ పనుల అనంతరం రీస్టోర్ చేయడంతో రైళ్ల రాకపోకలు యథాతథంగా కొనసాగాయి. పరిస్థితిని ఎప్పటికప్పుడు సామర్లకోట స్టేషన్ సూపరింటెండెంట్ రమేష్ పర్యవేక్షించారు.

కాకినాడలో 6,600 కిలోల పీడీఎస్ బియ్యం సీజ్



సీజ్ చేసిన పీడీఎస్ బియ్యంతో అధికారులు

కలెక్టరేట్(కాకినాడ), సెప్టెంబరు 6: పీడీఎస్ బియ్యం అక్రమ నిల్వలకు సంబంధించిన సమాచారం మేరకు విజిలెన్స్ అధికారులు, రెవెన్యూ, సివిల్ సప్లయ్స్ అధికారులతో కాకినాడ పట్టణంలోని పళ్లంరాజునగర్‌కు చెందిన బొనేపల్లి శ్రీనివాస్ ఐరన్ షెడ్డును శుక్ర వారం తనిఖీ చేశారు. ఈ షెడ్‌లో 132 బ్యాగుల్లో 6,600 కిలోల పీడీఎస్ బియ్యాన్ని గుర్తించారు. ఈ బియ్యాన్ని మాడుగుల అయ్యప్ప, కాకినాడ మోటారు సైకిలిస్టులు, పలువురు కార్డుదారులనుంచి కొనుగోలు చేసి సమీప ప్రాంతాలకు చెందిన చేపల చెరువులకు అమ్ముతున్నారు. రూ.3,07,600 విలువగల 6,600 కిలోల పీడీఎస్ బియ్యాన్ని, ఒక్కతూకం యంత్రాన్ని సివిల్ సప్లయ్స్ అధికారులు, కాకినాడ అర్బన్‌లో సీజ్ చేశామని, 6ఏ కింద కేసు నమోదు చేశామని, అక్రమ నిల్వ చేస్తున్న వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేశామని రీజినల్ విజిలెన్స్ ఎస్పీ సుబ్బారెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజమహేంద్రవరం రీజినల్ విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ పరిధిలో పీడీఎస్ బియ్యం అక్రమ నిల్వలు, అక్రమ రవాణాపై నిరంతరం నిఘా కొనసాగుతుందన్నారు. పీడీఎస్ బియ్యం అమ్మినా, కొన్నా చట్టపరమైన చర్యలు తీసుకుంటా మన్నారు. విజిలెన్స్ అధికారులు జగన్నాథరెడ్డి, నవీన్‌కుమార్, జీవానందం, శివ, రెవెన్యూ సివిల్ సప్లయ్స్ అధికారులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న రైళ్ల రద్దు

- జరుగుతున్న రైల్వే ట్రాక్ పునరుద్ధరణ పనులు

ఏలేరులో పెరిగిన నీటి నిల్వలు

- 2000 క్యూసెక్కుల నీరు విడుదల
- 20.57 టీఎంసీలకు చేరిన నిల్వలు

ఏలేశ్వరం, సెప్టెంబరు 6: ఏలేశ్వరంలోని ఏలేరు ప్రాజెక్టు నుంచి 2000 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. కొద్దిరోజులుగా కురుస్తున్న వర్షాలకు నీటి నిల్వలు రోజురోజుకు పెరుగుతూ వస్తున్నాయి. ఎగువ ప్రాంతంలో కురుస్తున్న వర్షాలకు ప్రాజెక్టులో నీటి నిల్వలు పెరుగుతున్నాయి. దీంతో దిగువ ప్రాంత రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వర్షాలకు జలాశయం పరివాహక ప్రాంతం నుంచి 5319 క్యూసెక్కుల చొప్పున వరద నీరు వచ్చి చేరడంతో ఆశించిన స్థాయిలో నీటి నిల్వలు పెరుగుతున్నాయి. దీంతో ప్రాజెక్టులో శుక్రవారం నాటికి 86.56 మీటర్లకుగాను 84.78 మీటర్లు, 24.11 టీఎంసీలకుగాను 20.57 టీఎంసీలు చేరుకున్నాయి. ప్రస్తుతం విశాఖకు 300 క్యూసెక్కులు నీటిని విడుదల చేస్తున్నారు.



ఏలేరు ప్రాజెక్టు పరిధిలో నీటి నిల్వలు పెరిగిన దృశ్యం



ప్రత్యేక అలంకరణలో అయినవిల్లి ఆలయం

విఘ్నాలను తొలగించే సిద్ధి వినాయకుడు

● అయినవిల్లిలో వినాయక చవితి ఏర్పాట్లు పూర్తి

అయినవిల్లి, సెప్టెంబరు 6: అయినవిల్లిలో స్వయంభువై వెలిసిన వినాయకుడు సర్వ విఘ్నాలను తొలగించే స్వామిగా జగత్ ప్రసిద్ధినొందారు. ఏ శుభకార్యం తలపెట్టినా ముందుగా అయినవిల్లి సిద్ధి వినాయకుని దర్శించి పూజిస్తే ఆ కార్యం నిర్విఘ్నంగా పూర్తవుతుందని భక్తుల ప్రగాఢ విశ్వాసం. కోనసీమలోని మధ్యగౌతమీ, వృద్ధగౌతమీ గోదావరి పాయల సమీపంలో అయినవిల్లి సిద్ధివినాయకుడి ఆలయం ఉంది. అయినవిల్లి సిద్ధివినాయక ఆలయంలో గణపతి నవరాత్రులను పురస్కరించుకుని దేవస్థానం ఆధ్వర్యంలో ఏర్పాట్లు పూర్తి చేశారు. ఆలయ ప్రాంగణంలో పూలు, పత్రాలు, పండ్లతో ప్రత్యేకంగా అలంకరించారు. పందిళ్లు, విద్యుత్ దీపాలంకరణలు ఏర్పాటు చేశారు. చవితి రోజున ఉదయం 3.45 గంటల నుంచి స్వామివారికి అభిషేకాలు, పూజా కార్యక్రమాల అనంతరం భక్తులకు దర్శనాలు ఉంటాయని ఆలయ కార్యనిర్వహణాధికారి ముదునూరి సత్యనారాయణరాజు తెలిపారు. శైవాగమోక్త ప్రకారంగా అయినవిల్లి సూర్యనారాయణమూర్తి ఆధ్వర్యంలో శనివారం వినాయకచవితి సందర్భంగా స్వామివారికి వివిధ రకాల పండ్ల రసాలతో రుద్రాభిషేకం నిర్వహిస్తారు. లక్ష దూర్వార్చన, గణపతి కల్పం, శ్రీలక్ష్మీగణపతి హోమం నిర్వహించనున్నారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యాలు కలుగకుండా చర్యలు తీసుకున్నట్లు ఆలయ ఈవో తెలిపారు.

అయినవిల్లి క్షేత్రానికి వెళ్లాలంటే..

అయినవిల్లి వినాయకుడిని దర్శించుకోవాలని భక్తులు ఎంతో ఆతృత పడుతుంటారు. రాజమహేంద్రవరం నుంచి రావులపాలెం మీదుగా 60 కిలోమీటర్లు ప్రయాణించి అయినవిల్లి క్షేత్రం చేరుకోవచ్చు. కాకినాడ నుంచి 55కిలోమీటర్లు, పాలకొల్లు నుంచి వయా రాజోలు, అంబాజీపేట మీదుగా 61 కిలోమీటర్లు, అమలాపురం నుంచి వయా సిరిపల్లి మీదుగా 12 కిలోమీటర్లు పయనించి ఆ స్వామిని దర్శించుకోవచ్చు.



పుల్లా అబ్బులు-సత్యదేవానర్సరీలో తీర్చిదిద్దిన వృక్షగణపతి

అబ్బురపరుస్తున్న వృక్ష గణపతి

కడియం, సెప్టెంబరు 6: కడియపులంక సత్యదేవా నర్సరీలో వృక్షగణపతిని కూర్చారు.పుల్లా అబ్బులు, ఆయన కుమారులు వీరబాబు, రాజశేఖర్ పూలతో పర్యావరణ హితమైన వృక్ష గణపతి పేరిట వినాయక ఆకృతిని ఏర్పాటు చేశారు. కార్మికులతో మట్టి వినాయక బొమ్మలు తయారు చేయించి నర్సరీ రైతులకు అందజేశారు. పలువురు నర్సరీ రైతులు లయన్స్‌క్లబ్ మెంబర్లు పాల్గొన్నారు.



చవితి ఉత్సవాలకు లక్ష్మీగణపతి ఆలయం ముస్తాబు



బిక్కవోలు లక్ష్మీగణపతి ఆలయంలో ఏర్పాటుచేసిన పందిరి డెకరేషన్

బిక్కవోలు, సెప్టెంబరు 6: బిక్కవోలులోని ప్రాచీన లక్ష్మీగణపతి ఆలయంలో శనివారం నిర్వహించే వినాయక చవితి ఉత్సవాలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని ఆలయ కమిటీ అధ్యక్షుడు చాగంటి సాయిబాబారెడ్డి, ఆలయ ఈవో ఆకెళ్ల భాస్కర్ తెలిపారు. స్వామి దర్శనానికి వెళ్లే భక్తుల కోసం లైన్లు ఏర్పాటు చేశామన్నారు. శనివారం తెల్లవారుజాము నుంచే భక్తులకు స్వామి దర్శనం కల్పిస్తామన్నారు. ఆలయ ప్రాంగణమంతా పందిరి డెకరేషన్, విద్యుత్ దీపాలంకరణ చేశామన్నారు.

భారీ పోలీసు బందోబస్తు

లక్ష్మీగణపతి ఆలయంలో శనివారం నిర్వహించే చవితి ఉత్సవాలకు సీఐ శివగణేష్ ఆధ్వర్యంలో భారీ బందోబస్తు ఏర్పాట్లు చేసినట్లు ఎస్ఐ రవిచంద్రకుమార్ తెలిపారు. ఆలయ ప్రాంగణంలో ఏర్పాటుచేసిన లైన్లను శుక్రవారం సీఐ పరిశీలించారు. ఇద్దరు ఎస్ఐలతో పాటు 25 మంది పోలీసులను బందోబస్తుకు నియమించినట్లు చెప్పారు. వీరి వెంట టీడీపీ నాయకులు పాలచర్ల శివప్రసాద్‌చౌదరి, పల్లి రాజారెడ్డి, కొమ్మోజు శ్రీనివాస్, వెంకటరామయ్య తదితరులున్నారు.

హౌసింగ్‌బోర్డు కాలనీ, పుష్కరవనంలో

చిరుత సంచరించిందని పుకార్లు

● అప్రమత్తమైన అటవీ సిబ్బంది

● అటవీ అధికారులు, ఉద్యోగుల విస్తృత గాలింపు

● ఆర్‌ఎఫ్ఆర్‌సీలో అమర్చిన ట్రాప్ కెమెరాలు



ఆర్‌ఎఫ్ఆర్‌సీలో అమర్చుతున్న ట్రాప్ కెమెరాలు, అనుమానాస్పదంగా ఉన్న పులి అడుగుజాడలు

దివాన్‌చెరువు, సెప్టెంబరు 6: చిరుతపులి సంచరిస్తోందన్న వార్తలు నేపథ్యంలో అటవీశాఖ అధికారులు అప్రమత్తమయ్యారు. లాలాచెరువు హౌసింగ్‌బోర్డు కాలనీ, పుష్కరవనం మధ్య గురువారం అర్థరాత్రి సమయంలో చిరుతపులి సంచరించిందన్న వార్తలు కలకలం రేపాయి. దీంతో అటవీ సిబ్బంది, స్థానిక రాష్ట్ర అటవీ అకాడమీలో శిక్షణ పొందుతున్న ఉద్యోగులు శుక్రవారం ఉదయం నుంచి గోదావరి మహాపుష్కరవనం, దాని సమీపంలోని అటవీ పరిశోధనా సంస్థ(ఆర్ఎఫ్ఆర్‌సీ) పరిసరాల్లో విస్తృతంగా గాలించారు. కొన్ని అనుమానాస్పద అడుగుజాడలు కనిపించాయని, అయితే ఇటీవల కురిసిన వర్షాలు కారణంగా నేల బురదగా ఉండడంతో తమకు లభించిన అడుగు జాడలను వారు నిర్ధారించలేకపోయారు. కాగా అనుమానాస్పద అడుగుజాడలను ప్లాస్టర్ ఆఫ్ పారిస్‌తో పెగ్ మార్క్ చేసినట్టు దివాన్‌చెరువు సెక్షన్ డీఆర్వో పద్మావతి తెలిపారు. ఎనిమిది ట్రాప్ కెమెరాలను రప్పించామని, ఆర్ఎఫ్ఆర్‌సీ వద్ద అనుమానాస్పద పాదముద్ర లభించిన పరిసరాలలో వాటిని అమర్చుతున్నామన్నారు. దివాన్‌చెరువు, శ్రీరాంపురం, రూపానగర్, హౌసింగ్‌బోర్డుకాలనీ, ఆటోనగర్‌గ్రామాల ప్రజలు చిరుతపులి సంచరిస్తుందన్న ప్రచారంతో భయాందోళనలు చెందుతున్నారు.

ద్వారపూడి వెళుతున్న

హర్షకుమార్‌ను అడ్డుకున్న పోలీసులు

● జాతీయ రహదారిపై నిరసన.. నిలిచిన వాహనాలు

రాజమహేంద్రవరం సిటీ, సెప్టెంబరు 6: ద్వారపూడిలో బీఆర్ అంబేడ్కర్ విగ్రహాన్ని తొలగించిన సంఘటనపై బాధితులతో మాట్లాడేందుకు వెళుతున్న మాజీ ఎంపీ జీవీ హర్షకుమార్ కారును రాజమహేంద్రవరం బెస్ట్‌ప్రైజ్ సెంటర్ వద్ద పోలీసులు అడ్డుకున్నారు. దీంతో పోలీసుల తీరును వ్యతిరేకిస్తూ ఆయన అక్కడే జాతీయ రహదారిపై నిరసన వ్యక్తం చేశారు. శుక్రవారం నిర్బంధం లేకపోవడంతో ఆయన ద్వారపూడి నుంచి వచ్చిన కొంతమంది యువత కలిశారు. వారితో మాట్లాడిన సదరు యువతతో కలిసి కారులో ద్వారపూడి బయలుదేరారు. ఈ క్రమంలో పోలీసులు అడ్డగించడంతో హర్షకుమార్ జాతీయరహదారిపై దర్నా చేశారు. దీంతో సుమారు 2కిలోమీటర్ల వాహనాలు నిలిచిపోయాయి. పోలీసులు నేరుగా ఆయనను ఇంటికి తీసుకువెళ్లి మళ్లీ గృహనిర్బంధం చేశారు. హైవే సైడ్ అప్రోచ్ రోడ్డుగుండా వాహనాలను మళ్లించారు.



జాతీయ రహదారిపై హర్షకుమార్ కారును నిలుపుదల చేసిన పోలీసులు

వరద బాధితులకు ఎమ్మెల్యే బత్తుల రూ.25 లక్షల విరాళం



నగదు చెక్కును చూపిస్తున్న బత్తుల దంపతులు

రాజానగరం, సెప్టెంబరు 6: విజయవాడ పరిసర ప్రాంత వరద బాధితుల సహాయార్థం ముఖ్యమంత్రి సహాయ నిధికి రాజానగరం ఎమ్మెల్యే బత్తుల బల రామకృష్ణ శుక్రవారం రూ.25లక్షలు విరాళంగా ప్రకటించారు. వరద బాధితుల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని తాను అందించిన అనేక సేవా కార్యక్రమాలను ఈ సందర్భంగా గుర్తుచేశారు. తన భార్య వెంకటలక్ష్మి, కుమార్తెలు, అల్లుడు నిర్ణయం మేరకు నియోజకవర్గం తరపున రూ.25 లక్షలు విరాళంగా అందజేశామన్నారు. వరద బాధితులను ప్రభుత్వం అన్ని విధాలుగా ఆదుకోవాలనే సంకల్పంతో సీఎం సహాయ నిధికి అందించామన్నారు. వరద బాధితులకు ఆదుకోవడంలో సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ ఎనలేని సేవలందించారన్నారు. దీనిని దృష్టిలో ఉంచుకుని రాజానగరం నియోజకవర్గంలోని దాతలు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి వరద బాధితుల సహాయార్థం తమ విరాళాలను చెక్కు రూపంలోగానీ, డీడీ రూపంలో గానీ సీఎం సహాయనిధికి విరివిరిగా విరాళాలు అందజేయాలని కోరారు.

ఇద్దరు యువకులు ఆత్మహత్య



ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్న యువకులు

తాళ్లరేవు, సెప్టెంబరు 6: కాకినాడజిల్లా తాళ్లరేవు మండలం జి.వేమవరం పంచాయతీ పరిధి అడివిపోలంలో ఇద్దరు యువకులు ఆత్మహత్య చేసుకున్నట్లు కోరింగ ఎస్ఐ పి.సత్యనారాయణ శుక్రవారం తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. అడివిపోలం కోళ్ల పెంపక కేంద్రంలో పెదపూడి మండలం ఏపీత్రయంకు చెందిన పెసింగి విస్సాకు(21), గుర్రాని భవాని కిషోర్(22) ఇద్దరు స్నేహితులు. గురువారం రాత్రి జి.వేమవరం అడవిపోలం కోళ్లఫారంలోకి పనిచేసేందుకు వచ్చారు. అప్పులపాలై మద్యంమత్తులో వారు జీవితంమీద విరక్తిచెంది ఆత్మహత్య చేసుకున్నారని తెలిపారు. మృతదేహాలను కాకినాడ ప్రభుత్వాసుపత్రికి పోస్టుమార్టం నిమిత్తం పోలీసులు తరలించి అనంతరం మృతదేహాలను కుటుంబ సభ్యులకు అప్పగించారు. మృతుడు విస్సాకు సోదరుడు రాజు ఫిర్యాదు మేరకు సంఘటన స్థలాన్ని వెళ్లి పరిశీలించినట్టు ఎస్ఐ తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు.

రైల్వే ఓవర్ బ్రిడ్జి నుంచి దూకి యువకుడి ఆత్మహత్య

అనపర్తి, సెప్టెంబరు 6: అనపర్తి మండలం మహేంద్రవాడకు చెందిన లంక నరేంద్ర(18) అనపర్తి రైల్వే ఓవర్ బ్రిడ్జి పైనుంచి దూకి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. రైల్వే పోలీసులు, స్థానికుల వివరాల ప్రకారం.. నరేంద్ర అనపర్తిలోని తాతయ్య ఇంటివద్ద ఉంటూ స్థానికంగా దుకాణంలో పనిచేస్తున్నాడు. శుక్రవారం తెల్లవారు జామున కడుపునొప్పి వస్తుందని ఇంటి నుంచి బయటకు వెళ్లాడు. స్థానిక రైల్వే ఓవర్ బ్రిడ్జి పైనుంచి ట్రాక్‌పైకి దూకడంతో తల వెనుక బలమైన గాయమై అక్కడికక్కడే మృతి చెందాడు. రైల్వే సూపరింటెండెంట్ సమాచారం మేరకు సామర్లకోట రైల్వే ఎస్ఐ బి.లోవరాజు సంఘటనా స్థలానికి చేరుకుని శవపంచనామా నిర్వహించి మృతదేహాన్ని పోస్టుమార్టంకు తరలించారు. బంధువుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ లోవరాజు తెలిపారు.

మూడు నెలలకే హడావుడా?

● వారంరోజులైనా సమయం ఇవ్వరా..?

● గత ప్రభుత్వం కాంట్రాక్టర్లకు రూ.95వేలకోట్ల బిల్లులు బకాయిపెడితే అప్పుడు మాట్లాడలేదే

● వైసీపీపై అనపర్తి ఎమ్మెల్యే నల్లమిల్లి ఆగ్రహం

● గౌరవ వేతనాల జాప్యంపై జడ్పీటీసీల అసంతృప్తి

● వాకౌట్ చేస్తామనడంతో సరికాదన్న కూటమి ఎమ్మెల్యేలు

● తుపానులు, వరదలపై చర్చించాల్సిన అవసరం ఉందని హితవు

● చర్చించిన అంశాల అమలుకు చర్యలు: జడ్పీ చైర్మన్

● కాకినాడలో వాడివేడిగా జడ్పీ సమావేశం

● కూటమి ప్రభుత్వం వచ్చాకే స్థానిక సంస్థలకు గౌరవం

● రూ.1452కోట్ల ఆర్థిక సంఘం నిధులు నేరుగా జమ

● హర్షం వ్యక్తం చేసిన కూటమి ఎమ్మెల్యేలు

కాకినాడ సిటీ, సెప్టెంబరు 6: ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ప్రజా పరిషత్ సర్వసభ్య సమావేశం వాడిగావేడిగా సాగింది. ఏటా పంటలకు ఎదురవుతున్న ముంపు సమస్యకు శాశ్వత పరిష్కారంగా సాగునీటి వ్యవస్థలపై ఆక్రమణలు తొలగించి ఆధునికీకరించే సమగ్ర కార్యాచరణ రూపకల్పనకు సమావేశం నిర్ణయించింది. జిల్లాలో రహదారులు అధ్వానంగా మారాయని, కనీసం రోడ్ల గోతులు పూడ్చే పనులలైనా తక్షణం చేపట్టాలని సభ్యులు నిలదీశారు. కాకినాడ జిల్లా పరిషత్ కార్యాలయంలోని జీఎంసీ బాలయోగి సమావేశ మందిరంలో శుక్రవారం జడ్పీ సాధారణ సర్వసభ్య సమావేశం, స్థాయీ సంఘాల సమావేశాలు జరిగాయి. సమావేశానికి జిల్లా పరిషత్ చైర్మన్ విప్పర్తి వేణుగోపాలరావు అధ్యక్షత వహించారు.

జడ్పీటీసీల వేతనాలపై మాటామాటా..

జడ్పీ వైస్‌చైర్మన్ బుర్రా అనుబాబు నేతృత్వంలో జడ్పీటీసీ సభ్యులు మాట్లాడుతూ 21నెలలుగా తమకు గౌరవ వేతనం చెల్లించలేదని, జనరల్ ఫండ్స్ నుంచి గౌరవ వేతనం చెల్లించేలా తీర్మానం చేయాలని డిమాండ్ చేశారు. దీనిపై రాజ్యసభ సభ్యుడు పిల్లి సుభాష్ చంద్రబోస్ మాట్లాడుతూ జడ్పీటీసీలకు గౌరవ వేతనాలు ఇవ్వకుండా బాధపెట్టడం సరికాదని, తక్షణమే 50శాతం వేతనం అయినా చెల్లించాలని సూచించారు. మండపేట ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు మాట్లాడుతూ సభ్యుల వేతనాలు 50శాతంకాదని, పూర్తిగా చెల్లించాలని పట్టుబట్టారు. తాము వాకౌట్ చేసేందుకు సిద్ధంగా ఉన్నామని జడ్పీటీసీలు చెప్పగా జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్ స్పందిస్తూ ఈ విషయమై వారంరోజుల్లో నిర్ణయం తీసుకుంటామని, వేతనాల కోసం ప్రభుత్వానికి నివేదిక పంపుతానని తెలిపారు. అయినా జడ్పీటీసీలు అసంతృప్తి వ్యక్తం చేయడంతో రాజానగరం ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ కలుగజేసుకుని ప్రభుత్వం ఏర్పడి మూడునెలలే అయ్యిందని, ముఖ్యమైన సమస్యలు చర్చించాల్సి ఉండగా వాకౌట్ చేస్తామనడం సరికాదని హితవు పలికారు. రానున్న రోజుల్లో అందరం కలిసి పనిచేద్దామన్నారు. స్థానిక సంస్థల సభ్యులకు తగిన గుర్తింపు గౌరవం లభించే రోజులు కానున్నాయన్నారు. ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు మాట్లాడుతూ కోనసీమలో ముంపు సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలన్నారు.

అప్పుడు మాట్లాడలేదే: అనపర్తి ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డి

అనపర్తి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ గత ప్రభుత్వం కాంట్రాక్టర్లకు రూ.95వేలకోట్ల బిల్లులు బకాయి పెడితే నోరు విప్పని ప్రజాప్రతినిధులు ఈ మూడు నెలలకే హడావిడి చేయడం సరికాదన్నారు. దీనివల్ల కొందరు కాంట్రాక్టర్లు ఆత్మహత్యలకు పాల్పడ్డారన్నారు. 14, 15 ఆర్థిక సంఘ నిధులను స్థానిక సంస్థలకు జగన్ ప్రభుత్వం జమచేయలేదని, కూటమి ప్రభుత్వం వచ్చిన వెంటనే రూ.1452కోట్లు నేరుగా స్థానిక సంస్థలకు జమచేసి వాటి గౌరవాన్ని కాపాడిందన్నారు. 21నెలలుగా చెల్లించని గౌరవవేతనం సమస్య పరిష్కారం కోసం ప్రభుత్వానికి వారంరోజులు సమయం ఇవ్వకుండా జడ్పీటీసీలు వాకౌట్ చేస్తామనడం సమంజసం కాదన్నారు. తుపానులు, వరదలతో ప్రజలు ఇబ్బందుల్లో ఉన్నప్పుడు వాటి గురించి చర్చించాల్సిన అవసరం ఉందన్నారు. ఈ ప్రభుత్వం వచ్చిన వెంటనే రూ.20కోట్లతో గోదావరి డెల్టా ఆధునికీకరణ పనులు ప్రారంభించిందన్నారు. ఉమ్మడి గోదావరి జిల్లాల 34 మంది ఎమ్మెల్యేలు, ఐదుగురు కలెక్టర్లతో సమావేశం ఏర్పాటుచేసి డెల్టా ఆధునికీకరణకు నివేదికలు రూపొందించాలన్నారు.

కాలువలపై ఆక్రమణలు తొలగించాలి: కాకినాడ రూరల్ ఎమ్మెల్యే నానాజీ

కాకినాడరూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీ మాట్లాడుతూ ఇరిగేషన్ కాలువలపై ఆక్రమణలు తొలగించి వాటిని ఆధునికీకరించాలన్నారు. వర్షాకాలంలో ప్రజలకు, రైతులకు ఇబ్బందులు కలుగకుండా చూడాలన్నారు. రమణయ్యపేట నుంచి గొడారిగుంట మీదుగా ఉప్పుటేరులో ముంపు నీరు కలిసే పళ్లంరాజు కెనాల్ మీద ఆక్రమణలు తొలగించాలన్నారు. రమణయ్యపేట పరిసర గ్రామాల్లో ఫ్యాక్టరీల కాలుష్యం, రసాయన వ్యర్థాలతో ప్రజలు అనారోగ్యాల పాలవుతున్నారని, అక్కడ కార్పొరేట్ స్థాయి ఆస్పత్రిని కట్టించి అందుబాటులోకి తేవాలన్నారు.



సమావేశంలో పాల్గొన్న జడ్పీటీసీలు

రోడ్ల పరిస్థితి దారుణం: జగ్గంపేట ఎమ్మెల్యే నెహ్రూ

జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ మాట్లాడుతూ జిల్లాలో రోడ్ల పరిస్థితి చాలా దారుణంగా ఉందన్నారు. పూర్తి స్థాయిలో కాకపోయినా తక్షణం గోతులను అయినా పూడ్చించాలన్నారు. వాహనాలపై ప్రయాణించేవారు గోతుల్లో పడి ప్రమాదాలకు గురై మరణిస్తున్నారన్నారు. కూటమి ప్రభుత్వం 15వ ఆర్థిక సంఘం ద్వారా రూ.1450 కోట్ల నిధులు నేరుగా గ్రామ పంచాయతీలకు విడుదల చేసి స్థానిక సంస్థల సభ్యుల గౌరవం పెంచిందన్నారు.

ప్రజాసమస్యల పరిష్కారానికి కృషి: జడ్పీ చైర్మన్

జడ్పీ చైర్మన్ వేణుగోపాలరావు మాట్లాడుతూ ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలకు సంబంధించి ప్రజాసమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని, విస్తృతంగా చర్చించిన అంశాల అమలుకు చర్యలు తీసకుంటామని తెలిపారు. జిల్లాకు సంబంధించిన పలు సమస్యలపై చర్చించారు. జడ్పీ సీఈవో శ్రీరామచంద్రమూర్తి మాట్లాడుతూ సభ్యుల గౌరవ వేతన విషయం ఇప్పటికే ప్రభుత్వం దృష్టిలో ఉందన్నారు. సమావేశంలో తూర్పుగోదావరి జేసీ ఎస్.చినరాముడు, వివిధ మండలాల జడ్పీటీసీలు, ఎంపీపీలు, ఉమ్మడి జిల్లా వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న రైళ్ల రద్దు

● జరుగుతున్న రైల్వే ట్రాక్ పునరుద్ధరణ పనులు

సామర్లకోట, సెప్టెంబరు 6: విజయవాడ ఎగువ ప్రాంతా లలో రైల్వేట్రాక్ భారీ వరదల కారణంగా దెబ్బతినడంతో సామర్లకోట మీదుగా అటు విశాఖ, ఇటు విజయవాడలకు పలు రైళ్ల రాకపోకలను రద్దుచేసిన కొన్ని రైళ్లను తిరిగి పునరుద్ధరించారు. ఇంకా మరి కొన్ని రైళ్లను రద్దు జాబితాలో ఇంకా కొన సాగిస్తూ రైల్వే ఉన్నతాధికారులు రాత్రి ఉత్తర్వులు జారీ చేశారు. నెం. 12737 గల కాకినాడ-లింగంపల్లి మధ్య నడిచే ఎక్స్‌ప్రెస్ ముందుగా నిర్దేశించన సమయం శుక్రవారంరాత్రి 7.10కు కాకుండా అర్ధరాత్రి 12.30కు రీషెడ్యూల్ చేసి కాకినాడ నుంచి బయలుదేరుతుందని సామర్లకోట స్టేషన్ సూపరింటెండెంట్ ఎం.రమేష్ శుక్రవారంరాత్రి చెప్పారు. ఈమేరకు డిప్యూటీ సీవోఎం కె.మణికుమార్ (సికింద్రాబాద్) నుంచి ఉత్తర్వులు అందాయి. ఈనెల 7,8,9 తేదీల వరకూ రద్దు చేసిన రైళ్ల వివరాలను ఈవిధంగా ఉన్నాయి. విజయవాడ-రాజమండ్రి మధ్య నడిచే(07459) రైలు, భీమవరం-నిడదవోలు మధ్య నడిచే (07885) రైలు, రాజమండ్రి- విజయవాడ మధ్య నడిచే (07460) రైలు, భీమవరం-నిడద వోలు మధ్య నడిచే (07885) రైలు, నిడదవోలు-భీమవరం మధ్య నడిచే (07886) రైలు, నరసాపురం-నిడదవోలు- నరసాపురం మధ్య నడిచే రైలు (07673,07674), భీమవరం-నిడదవో లు-భీమవరం మధ్య నడిచే రైళ్లు (07772, 07882), విజయ వాడ-రాజమండ్రి- విజయవాడ మధ్య నడిచే రైళ్లు (07768, 07767) ఈనెల 7,8 తేదీలలో రద్దు చేశారు. కాకినాడ-విజయ వాడ మధ్య నడిచే రైలు (17258) ఈనెల 7,8,9 తేదీలలో రద్దు చేశారు. గురువారం విశాఖ- గుంటూరుల మధ్య సింహాద్రి ఎక్స్‌ప్రెస్ ఈనెల 9వరకూ రద్దయ్యాయి. కాకినాడ-లింగం పల్లి- కాకినాడ మధ్య నడిచే (12737, 12738, 12775) రైలు, నాందేడ్-విశాఖ మధ్య నడిచే (20812) రైలు, విశాఖ-మహ బూబ్‌నగర్-విశాఖ మధ్య నడిచే (12861, 12862) రైళ్లు ఈనెల 5 నుంచి విజయవాడ సమీపాన రాయనపాడు స్టేషన్లో హాల్ట్ పాక్షికంగా ఎత్తివేశారు. ఈమేరకు రైల్వే ఎస్టీఎం చార్జ్ అధికారి రాజనరసు సామర్లకోట రైల్వే ఉన్నతాధికారులకు జారీ చేసిన ఉత్తర్వులలో పేర్కొన్నారు.

పూలు కోయడానికి మడుగులోకి దిగి వ్యక్తి మృతి

కరప, సెప్టెంబరు 6: కలువ పూలు కోయడానికని మడుగులోకి దిగిన ఒక వ్యక్తి ప్రమాదవవశాత్తూ అందులో మునిగి చనిపోయినట్టుగా కరప పోలీసులు తెలిపారు. కాకినాడజిల్లా కరప మండలం కూరాడ శివారు చినమామిడాడ గ్రామానికి చెందిన బత్తుల శివ కూలి పనులు చేసుకుంటూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. వినాయక చవితి పర్వదినానికి కలువ పూలు విక్రయిద్దామని భావించిన శివ బుధవారం స్థానికంగా ఉన్న ఒక మడుగులోకి దిగాడు. పూలు కోస్తుండగా శివకు ఫిట్స్ వచ్చి మడుగులో బోర్లా పడ్డాడు. ఆ సమయంలో ఎవరూ గమనించకపోవడంతో మడుగులో మునిగి చనిపోయాడు. శుక్రవారం ఉదయం మడుగుపై తేలిన మృతదేహాన్ని గుర్తించిన స్థానికులు వీఆర్‌వో దేవగుప్తాపు ప్రసన్న ద్వారా కరప పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని మృతదేహానికి పోస్టుమార్టమ్ నిమిత్తం కాకినాడ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మృతుడికి భార్య, ఇద్దరు మగ పిల్లలు ఉన్నారు. బాధితుల ఫిర్యాదు మేరకు కరప ఇన్‌చార్జ్ ఎస్ఐ మూర్తి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

లారీ ఢీకొని ఇద్దరు ఇంజనీరింగ్ విద్యార్థుల మృతి

● మృతులు పల్నాడు జిల్లా సీవల్లిపురం, శ్రీకాకుళం జిల్లా పలాసవాసులు ● శోకసంద్రంలో తోటి విద్యార్థులు



రాజమహేంద్రవరం ప్రభుత్వాసుపత్రివద్ద రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన విద్యార్థుల భౌతికకాయాల వద్ద విలపిస్తున్న బంధువులు, విద్యార్థులు

రోణంకి ప్రవీణ్ కుమార్ (ఫైల్) | చింతా కార్తీక్ (ఫైల్)

దివాన్‌చెరువు, సెప్టెంబరు 6: తూర్పుగోదావరిజిల్లా జాతీయ రహదారిపై దివాన్‌చెరువు వద్ద ద్విచక్రవాహనాన్ని లారీ ఢీకొన్న ప్రమాదంలో పల్నాడు జిల్లా సీవల్లిపురం గ్రామానికి చెందిన చింతా కార్తీక్(19), శ్రీకాకుళం జిల్లా పలాసకు చెందిన రోణంకి ప్రవీణ్(21) అక్కడికక్కడే దుర్మరణం చెందారు. వీరిద్దరూ ఇక్కడ సమీపంలోని గైట్ ఇంజనీరింగ్ కళాశాలలో బీటెక్ చదువుతున్నారు. గురువారం అర్ధరాత్రి జరిగిన ఈ ప్రమాదానికి సంబంధించి బొమ్మూరు ఎస్ఐ అంకారావు శుక్రవారం విలేకరులకు తెలిపిన వివరాలు ఈవిధంగా ఉన్నాయి. వీరు బ్రిడ్జి కౌంటీలోని ఒక రూమ్‌లో ఉంటున్నారు. ప్రవీణ్‌కు ఒంట్లో బాగోకపోవడంతో ఇద్దరు గురువారంరాత్రి స్కూటీపై ఆసుపత్రికి బయలుదేరారు. మార్గమధ్యంలో దివాన్‌చెరువు పెట్రోలు బంకు వద్దకు వచ్చేసరికి వెనుక నుంచి వస్తున్న లారీ బలంగా వీరిని ఢీకొని కొద్దిదూరం ఈడ్చుకుంటూ వెళ్లిపోయింది. ఈ ఘటనలో ఇద్దరి శరీరభాగాలు తెగి రహదారిపై చెల్లాచెదురుగా పడిపోయాయి. దీంతో ఆప్రాంతమంతా రక్తసిక్తమైంది. సమాచారం అందుకున్న వెంటనే బొమ్మూరు సీఐ కాశీవిశ్వనాథ్ సంఘటనా స్థలానికి చేరుకున్నారు. ప్రమాదానికి కారణమైన లారీని స్వాధీనం చేసుకోగా డ్రైవరు పరారీలో ఉన్నాడన్నారు. శవపరీక్ష నిమిత్తం మృతదేహాలను రాజమహేంద్రవరం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ అంకారావు తెలిపారు.

సహచర విద్యార్థుల దిగ్భ్రాంతి

శవపరీక్ష అనంతరం విద్యార్థుల భౌతికకాయాలు తీసుకువెళ్తున్న అంబులెన్స్‌లను వారు చదువుతున్న కళాశాల ప్రధానద్వారం వద్దకు తీసుకు వచ్చి కొద్దిసేపు ఉంచారు. నిన్నటి వరకూ తమతో కలసి ఉన్న విద్యార్థులు రోడ్డు ప్రమాదానికి గురై తిరిగిరాని లోకాలకు చేరుకోవడంతో సహచర విద్యార్థులు జీర్ణించుకోలేకపోయారు. కళాశాల యాజమాన్యం, అధ్యాపకులు, తోటి విద్యార్థులు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేసి సంతాపం తెలిపారు.



ర్యాలీగా వెళుతున్న విద్యార్థులు



బోరున విలపిస్తున్న కార్తీక్ తండ్రి వీరాంజనేయులు

ఒక్క కొడుకూ దూరమయ్యాడు...

● మృతుడు కార్తీక్ తండ్రి వీరాంజనేయులు కన్నీటి పర్యంతం

రాజమహేంద్రవరంఅర్బన్, సెప్టెంబరు 6: ఎన్నో ఆశలతో ఇంజనీరింగ్ చదివిస్తున్న తన ఒక్కగానొక్క కొడుకు దూరమయ్యాడని దివాన్‌చెరువు వద్ద లారీ ఢీ కొన్న దుర్ఘటనలో మృతి చెందిన చింత కార్తీక్ తండ్రి వీరాంజనేయులు రోధించడం అక్కడున్న వారిని కలచివేసింది. రోడ్డు ప్రమాదంలో దుర్మరణం పాలైన ఇంజనీరింగ్ విద్యార్థులు చింత కార్తీక్, రోణంకి ప్రవీణ్ మృతదేహాలకు శుక్రవారం రాజమహేంద్రవరంలోని జీజీహెచ్‌లో పోస్టుమార్టం నిర్వహించారు. అనంతరం వారి బంధువులకు అప్పగించారు. కాగా, వీరాంజనేయులు వ్యవసాయం చేస్తుంటారు. ప్రమాదం వార్త తెలియగానే పలాస నుంచి ప్రవీణ్ కుటుంబ సభ్యులు, వినుకొండ నుంచి కార్తీక్ కుటుంబ సభ్యులు హుటాహుటిన రాజమహేంద్రవరం చేరుకున్నారు. కన్నీరుమున్నీరుగా విలపించారు. ఆసుపత్రి మార్చురీ వద్దకు గైట్ కళాశాల విద్యార్థులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. కొందరు విద్యార్థులు కన్నీళ్లు పెట్టుకున్నారు.

కాకినాడ

ఘనంగా చండీహోమం

అన్నవరం, సెప్టెంబరు 6: రత్నగిరి క్షేత్రరక్షకి వనదుర్గ ఆలయంలో శుక్రవారం చండీహోమం ఘనంగా జరిగింది. ఉదయం 9గంటలకు పండితులు గణపతిపూజ, పుణ్యాహవచనం అనంతరం అమ్మవారికి చండీ,సప్తసతి పారాయణలు మూలమంత్రజపములు పఠించారు. పవిత్ర హోమ గుండంలో సుగంధద్రవ్యాలనర్పించి పూర్ణాహుతి గావించారు. చతుర్వేద పండితుల వేదాశీర్వచనాలు అనంతరం తీర్థప్రసాదాలు అందజేశారు.

వ్యవసాయాధికారులు నష్టాలను నమోదు చేయాలి

పిఠాపురం మాజీ ఎమ్మెల్యే వర్మ

పిఠాపురం, సెప్టెంబరు 6: సుద్దగడ్డ వరదలు, అకాలవర్షాలు తగ్గినందున వ్యవసాయాధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి పంటలకు జరిగిన నష్టాలను నమోదు చేయాలని పిఠాపురం మాజీ ఎమ్మెల్యే ఎస్వీఎస్ఎన్ వర్మ డిమాండ్ చేశారు. ఈ క్రాప్ బుకింగ్ సక్రమంగా చేయడం లేదని, పొలాలను వ్యవసాయ సిబ్బంది సందర్శించడం లేదని రైతులు నుంచి ఫిర్యాదులు వస్తున్నాయని తెలిపారు. పిఠాపురం టీడీపీ కార్యాలయంలో శుక్రవారం ఆయన మాట్లాడుతూ నష్టపోయిన ప్రతి రైతును ఆదుకుంటామని, పరిహారం అందించేందుకు కూటమి ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. ఎక్కడైనా వ్యవసాయ సిబ్బంది, అధికారులు పంటనష్టాలు సక్రమంగా రాయకపోయినా, ఈ క్రాప్ నమోదు చేయకపోయినా, ఈ విషయంలో రాజకీయాలు చేసినా టీడీపీ కార్యాలయానికి ఫోన్ చేసి తెలియజేయాలని తాను తక్షణం వచ్చి వారికి అండగా నిలుస్తానని తెలిపారు. సమావేశంలో టీడీపీ నేతలు కొండేపూడి సూర్యప్రకాష్, పిల్లి చిన్నా, కొరుప్రోలు శ్రీను, సోము సత్యనారాయణ, నామా దొరబాబు, నల్లా శ్రీను, సూరవరపు సుబ్బారావు, కోళ్ల బంగారుబాబు, అల్లవరపు నగేష్, రాయుడు శ్రీను పాల్గొన్నారు.

'పంచాయతీలకు వరద సహాయం అభినందనీయం'

కరప, సెప్టెంబరు 6: రాష్ట్రంలో వరద బారిన పడిన 400 పంచాయతీలకు రూ.4కోట్ల విరాళాన్ని ప్రకటించిన డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ అభినందనీయులని జనసేన పార్టీ సీనియర్ నేత డాక్టర్ బొండా సూర్యారావు కొనియాడారు. కరపలో శుక్రవారం ఆయన మాట్లాడుతూ 2తెలుగు రాష్ట్రాలకు కోటి రూపాయల చొప్పున ఆయన వరద సహాయం అందించారన్నారు. పవన్ స్ఫూర్తితో పంచాయతీరాజ్‌శాఖ ఉద్యోగులు రూ.14.86కోట్ల విరాళం ప్రకటించడం ముదావహమన్నారు. జనసేన నాయకులు, అభిమానులు స్వచ్ఛందంగా ముందుకొచ్చి వరద బాధితులకు సహాయ సహకారాలు అందించాలని కోరారు. జనసేన నాయకులు దూడల నారాయుడు, పోలిశెట్టి తాతీలు, కొండేపూడి దొరబాబు, బొండా గోవిందు, ఆకుల కృష్ణమూర్తి,ఆకుల శ్రీను పాల్గొన్నారు.

'ప్రకృతి వ్యవసాయం లాభదాయకం'

ప్రత్తిపాడు, సెప్టెంబరు 6: తక్కువ పెట్టుబడితో ప్రకృతి వ్యవసాయం లాభదాయకమని జగ్గంపేట వ్యవసాయ శాఖ సబ్ డివిజన్ ఏడీఏ వైవీ గంగాధర్ చెప్పారు. పెద్దిపాలెం గ్రామంలో శుక్రవారం ప్రకృతి వ్యవసాయ సాగు చేపట్టిన పంట పొలాలను ఏడీఏ ఆధ్వర్యంలో వ్యవసాయ అధికారుల బృందం సందర్శించి రైతులతో సమావేశమయ్యారు. ఏడీఏ మాట్లాడుతూ జీవామృతం, నామాత్రం, బ్రహ్మాస్త్రం, తూటికాడ కాషాయం వంటి పద్ధతుల ద్వారా ప్రకృతి వ్యవసాయం చేయడం ఎంతో ఆరోగ్యదాయకమన్నారు. సమావేశంలో వ్యవసాయ సహాయకులు గణేష్, మణికంఠ, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, చినబాబు, మల్లేశ్వరావు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

'ఆదివాసీలకు మౌలిక వసతుల కల్పన'

ప్రత్తిపాడు, సెప్టెంబరు 6: ఆదివాసీలకు మౌళిక వసతుల కల్పనకు కేంద్రరాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు తీసుకుంటున్నాయని ప్రత్తిపాడు తహశీల్దార్ ఎం.సూర్యప్రభ, ఎంపీడీవో ఎంవీఆర్ కుమార్‌బాబు చెప్పారు. ప్రధాన మంత్రి జనజాతి ఆదివాసీ న్యాయ మహా అభియాన్ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం మండలంలోని సబ్‌ప్లాన్ ఏజెన్సీ గ్రామాలైన బౌరువాక, బురదకోట పంచాయతీ పరిధిలోని మెట్టిచింత గ్రామాల్లో గిరిజనులతో గ్రామసభలు నిర్వహించారు. కొండ రెడ్లకు కుల ధ్రువీకరణ పత్రాలు మంజూరు చేయడం లేదని సమావేశం దృష్టికి తీసుకురాగా చర్యలు తీసుకుంటామని తహశీల్దార్ హామీ ఇచ్చారు. సమావేశంలో ఈవోపీఆర్డీ కాశీ విశ్వనాథ్ పాల్గొన్నారు.

'రోటరాక్టు యంగ్ లీడర్స్' కార్యవర్గ ప్రమాణస్వీకారం

తుని రూరల్, సెప్టెంబరు 6: స్థానిక శ్రీ ప్రకాష్ విద్యాసంస్థల అనుబంధ సంస్థ స్పేసెస్ డిగ్రీకళాశాల నందు రోటరాక్ట్ క్లబ్ యంగ్ లీడర్స్ అండ్ సబల కార్యవర్గ ప్రమాణ స్వీకారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా డిస్ట్రిక్ రోటరాక్ట్ కమిటీ ఛైర్మన్ టి.రవి హాజరయ్యారు. అధ్యక్షుడిగా ఐ.చరణ్, సబల అధ్యక్షురాలిగా కె.సాత్విక, కార్యదర్శులుగా జాఫర్, అనూరాధ, కార్యవర్గ సభ్యులతో రోటరీ క్లబ్ తుని ప్రెసిడెంట్ సీహెచ్ మంగరాజు ప్రమాణస్వీకారం చేయించారు. డిస్ట్రిక్ రోటరాక్ట్ రవి, రోటరీ సంస్థకు చెందిన అసిస్టెంట్ గవర్నర్ డి.పద్మావతి, కార్యదర్శి ఎన్.వీరబాబు తదితరులున్నారు.

ధర్మవరంలో ఆక్రమణల తొలగింపు

ప్రత్తిపాడు, సెప్టెంబరు 6: మండలంలో మేజర్ పంచాయతీ ధర్మవరం గ్రామ ప్రధానరహదారి వెంబడి ఆక్రమణల తొలగింపు పనులు శుక్రవారం ప్రారంభమయ్యాయి. పశువుల ఆసుపత్రి సెంటర్ నుంచి వినాయక గుడి హైవే జంక్షన్ వరకు రహదారి వెంబడి ఆక్రమణలతో ట్రాఫిక్ సమస్యలు వస్తున్నాయని గ్రామస్తులు ప్రత్తిపాడు కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. ఈ క్రమంలో 54 మంది ఆక్రమణదారులకు పంచాయతీ సెక్రటరీ ద్విభాష్యం శ్రీనివాసరావు నోటీసులు జారీ చేశారు. శుక్రవారం ఆక్రమణదారులు స్వచ్ఛంధంగా గృహాల ఎదుట ప్రదేశాలను ఖాళీ చేసే పనులు చేపట్టారు.

11న అప్రెంటిస్ మేళా

కార్పొరేషన్ (కాకినాడ), సెప్టెంబరు 6: కాకినాడ, కోనసీమ జిల్లాల్లో వివిధ కంపెనీల్లో ఉన్న అప్రెంటిస్ ఖాళీలను భర్తీ చేయడానికి ప్రభుత్వ ఐటీఐ కాకినాడలో ఈ నెల 11న ఐటీఐ పాసైన విద్యార్థులకు ప్రైమ్ మినిస్టర్ నేషనల్ అప్రెంటిస్ మేళా నిర్వహిస్తోందని కళాశాల ప్రిన్సిపాల్ తెలిపారు. జిల్లాలో ప్రముఖ పరిశ్రమల నుంచి మేనేజ్‌మెంట్, సిబ్బంది వచ్చి వారికి కావాల్సిన అప్రెంటిస్ ట్రైనీస్‌ను ఇంటర్వ్యూ చేసి ఎంపిక చేస్తారన్నారు. ప్రభుత్వ, ప్రైవేట్ ఐటీఐలో వివిధ ట్రేడ్లలో ట్రైనింగ్ పూర్తి చేసి ఎన్‌టీసీ సర్టిఫికెట్ కలిగిన విద్యార్థులు అన్ని ఒరిజినల్ సర్టిఫికెట్లతో మేళాకు హాజరు కావాలన్నారు. వివరాలకు 8639230775 నెంబర్‌లో సంప్రదించాలని తెలిపారు.

'ఎస్సీ వర్గీకరణ తీర్పుపై ఆందోళనలు'

కార్పొరేషన్(కాకినాడ), సెప్టెంబరు 6: ఎస్సీ వర్గీకరణకు అనుకూలంగా సుప్రీంకోర్టు తీర్పు రాజ్యాంగ విరుద్ధమని, ఈ తీర్పునకు వ్యతిరేకంగా దళితలంతా ఐక్యంగా గ్రామాలవారీగా ఉద్యమాలు ఉధృతం చేస్తామని మాలమహానాడు జేఏసీ నాయకులు సిద్ధాంతుల కొండబాబు, ఎ.రామేశ్వరరావు, పిట్టా వరప్రసాద్, పండు అశోక్‌కుమార్, సుబ్బు, ఏనుగుపల్లి కృష్ణ, నూకరాజు పేర్కొన్నారు. కాకినాడ అంబేద్కర్ భవన్‌లో శుక్రవారం రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు. జిల్లా వ్యాప్తంగా వచ్చిన దళిత నేతల సమక్షంలో 38మందితో జిల్లా జేఏసీ ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో మేఘం రాజు, లింగం శివకుమార్, దారా సురేష్, సుబ్రహ్మణ్యం, కిరణ్, టి.చెంగళరావు పాల్గొన్నారు.

జేఏసీ జిల్లా అధ్యక్షుడిగా కొండబాబు

కార్పొరేషన్(కాకినాడ), సెప్టెంబర్ 6: మాలమహానాడు జేఏసీ జిల్లా అధ్యక్షుడిగా సిద్ధాంతపు కొండబాబు, జిల్లా గౌరవాధ్యక్షుడిగా ఐతాబత్తుల రామేశ్వరరావు, తుమ్మల నూకరాజు, పిట్టా వరప్రసాద్, పండు అశోక్‌కుమార్, జిల్లా కన్వీనర్లుగా ఏనుగుపల్లి కృష్ణ, తోటి చెంగల్‌రావు, బుంగ సతీష్‌కుమార్, మాత సుబ్రహ్మణ్యంలతో పాటు 30 మందిని నియమించారు. ఈనెల 11న జరగబోయే ఢిల్లీ ముట్టడి కార్యక్రమానికి మద్దతిస్తూ జిల్లాలోని కలెక్టరేట్ వద్ద ఆరోజున నిరసన తెలియజేయాలని తీర్మానించారు.

కాపు, బలిజ సంక్షేమసేన కోఆర్డినేటర్‌గా పెదబాబీ



గొల్లప్రోలు, సెప్టెంబరు 6: కాపు, బలిజ, సంక్షేమసేన కాకినాడ, కోనసీమ, తూర్పుగోదావరి జిల్లాల కోఆర్డినేటర్‌గా గొల్లప్రోలు పట్టణానికి చెందిన వ్యాపారవేత్త గొల్లపల్లి తాతాజీ (పెదబాబీ) నియమితులయ్యారు. ఈ మేరకు సేన వ్యవస్థాపక అధ్యక్షుడు చేగొండి హరిరామజోగయ్య ఉత్తర్వులు జారీ చేశారు. పెదబాబీని పలువురు అభినందించారు.

ప్రహరీ నిర్మాణంపై నిరసన

సర్పవరం జంక్షన్, సెప్టెంబరు 6: రమణయ్యపేటకు చెందిన ఓ ప్రాంతం కోర్టు లావాదేవీల్లో ఉందని, బలవంతంగా కొందరు ప్రహరీ నిర్మించారంటూ తెలుగు జనతాపార్టీ అధ్యక్షుడు పి.వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో నిరసన నిర్వహించారు.

మద్యంతో వ్యక్తి అరెస్ట్

జగ్గంపేట రూరల్, సెప్టెంబరు 6: జగ్గంపేటలో శుక్రవారం అక్రమంగా మద్యం విక్రయిస్తున్న ఒక వ్యక్తిని అరెస్ట్ చేసినట్లు ఎస్ఐ రఘునాధరావు తెలిపారు. 8 క్వార్టర్ బాటిల్స్ 4కింగ్ ఫిషర్ బీర్లు స్వాధీనం చేసుకున్నారు.

వినాయక చవితి శోభ

పూజాసామగ్రి కొనుగోళ్లతో కళకళలాడిన మార్కెట్లు

ఉత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు




గొల్లప్రోలులో పూజాపత్రి కొనుగోలు చేస్తున్న ప్రజలు, జగ్గంపేటలో ఓ దుకాణం వద్ద యువత

పిఠాపురం/గొల్లప్రోలు/జగ్గంపేట/ఏలేశ్వరం/ప్రత్తిపాడు/తునిరూరల్/కిర్లంపూడి, సెప్టెంబరు 6: పిఠాపురం పట్టణానికి వినాయక చవితి శోభ చేకూరింది. నియోజకవర్గ ప్రధాన కేంద్రంతో పాటు 70 గ్రామాలకు ముఖ్యకూడలి కావడంతో ప్రధాన రహదారులన్నీ ప్రజలతో కళకళలాడాయి. ప్రజలు వినాయక విగ్రహాలు, పండ్లు, పాలవెల్లులు, పువ్వులు, తదితర పూజాసామగ్రిని కొనుగోలు చేయడంలో నిమగ్నమయ్యారు. ఎక్కడికక్కడ పత్రి, పాలవెల్లులు, పండ్లు విక్రయించే దుకాణాలు వెలిశాయి. పిఠాపురం నియోజకవర్గ పరిధిలోని వివిధ ప్రాంతాల్లో 260 వినాయక విగ్రహాల ఏర్పాటుకు పోలీసులు అనుమతులు ఇచ్చారు. గొల్లప్రోలు పట్టణంలో వినాయక చవితి సందడి నెలకొంది. వినాయకచవితి నవరాత్రి ఉత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు యువత, ఆయా ప్రాంత ఉత్సవకమిటీలు ఏర్పాట్లు చేస్తున్నారు. పందిర్లను అలంకరించి తొమ్మిది రోజుల పాటు కార్యక్రమాలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. జగ్గంపేటలో పలు కూడళ్లల్లో పందిళ్లు వేసి వినాయక ప్రతిమలు నెలకొల్పేందుకు ఏరాటు జరిగాయి. జగ్గంపేట 4రోడ్ల జంక్షన్లో పూలు పండ్లు, ఇతర సామాగ్రి కొనుగోలు చేసేందుకు ప్రజలు తరలి రావడంతో సెంటర్ రద్దీగా మారింది. కిర్లంపూడిలో మార్కెట్ కిటకిటలాడింది. ఏలేశ్వరం మండలంలోని ఆలయాలు, చవితి పందెళ్లను సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. ఏలేశ్వరం మార్కెట్‌లో భక్తులు గణేష్ పూజకు పూలు, పండ్లు, పత్రి, పిండి వంటలకు అవసరమయ్యే వస్తువులను కొనుగోలు చేశారు. వినాయక చవితి పూజా సామాగ్రి అమ్మకాలతో ప్రత్తిపాడు మార్కెట్ కళకళలాడింది. మండలంలోని పలు గ్రామాల్లో ఉత్సవాల ఏర్పాటుకు కమిటీలు మండపాలు ఏర్పాట్లు చేశారు.తుని కేంద్రంగా వినాయక విగ్రహాలు విక్రయాలు జరుపుతూ అనకాపల్లి జిల్లాకు తరలిస్తున్నారు. ఈ ఏడాది అయోధ్యరాముని చెంత గణనాధుడు తీర్చిదిద్దిన విగ్రహాలు ప్రతి చోట ట్రెండింగ్‌గా మారాయి.

మట్టి విగ్రహాల పంపిణీ

పిఠాపురం/గొల్లప్రోలు రూరల్, సెప్టెంబరు 6: మట్టి విగ్రహాలనే పూజిద్దామని, పర్యావరణానికి హాని కలిగించని విధంగా వినాయక చవితి జరుపుకుందామని విద్యార్థులు నిర్ణయించుకున్నారు. పిఠాపురంలోని జగ్గయ్యచెరువు కాలనీలో గల బాదం బాధవరావు ప్రభుత్వ బాలికోన్నత పాఠశాల విద్యార్థులతో మట్టి గణనాథుని విగ్రహాలు తయారు చేయించారు. వాటి వల్ల పర్యావరణానికి కలిగే ప్రయోజనాలను ఉపాధ్యాయులు వివరించారు. గొల్లప్రోలు మండలం చెందుర్తి మండలపరిషత్ ప్రాథమికోన్నత పాఠశాల విద్యార్థులకు మట్టి వినాయక విగ్రహాలు అందించి వాటిని తల్లిదండ్రులకు ఇచ్చి పూజలో వినియోగించాలని సూచించారు. గొల్లప్రోలు జిల్లాపరిషత్ బాలుర ఉన్నత పాఠశాల విద్యార్థులు వినాయక ప్రతిమలను మట్టితో చేశారు.

గండేపల్లి: సూరంపాలెంలోని ఆదిత్య యూనివర్శిటీ క్యాంపస్‌లో శ్రీ శారద రామకృష్ణ సేవా సమితి పెద్దబ్రహ్మదేవం సభ్యుల ఆధ్వర్యంలో మట్టి వినాయక ప్రతిమల పంపిణీ జరిగింది. ఆదిత్య యూనివర్శిటీ డిప్యూటీ ప్రో చాన్సలర్ డాక్టర్ ఎం.శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ప్రో చాన్సలర్ డాక్టర్ నల్లమిల్లి సతీష్‌రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై మట్టి ప్రతిమలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ప్రో వైస్ చాన్సలర్ డాక్టర్ ఎస్.రమాశ్రీ, రిజిస్ట్రార్ డాక్టర్ జి.సురేష్, అసోసియేట్ డీన్ స్కూల్ ఆఫ్ ఇంజనీరింగ్ డాక్టర్ ఎంవి రాజేష్, డీన్ వి.సత్యనారాయణ, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్స్ ఎవిబిఎస్ శర్మ, పున్నం నాగేశ్వరరావు, సమితి అధ్యక్షుడు తోటకూర గంగాధర్, సభ్యులు జి.ప్రకాశరావు, పి.సత్యనారాయణరెడ్డి, కూనిరెడ్డి శ్రీనివాస్, జి.వెంకటేష్ పాల్గొన్నారు.

పోర్టుసిటీ(కాకినాడ): పర్యావరణ పరిరక్షణకు మట్టి వినాయక బొమ్మలను పూజించాలని బీజేపీ మహిళా మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, లయన్ శ్రేయస్సు క్లబ్ అధ్యక్షురాలు సాలగ్రామ లక్ష్మీప్రసన్న అన్నారు. 36వ డివిజన్ పిండిప్రోలు వారివీధిలోని ఆమె స్వగృహంలో 400 మట్టి వినాయక బొమ్మలను శుక్రవారం ఉచితంగా పంపిణీ చేశారు. కార్యక్రమంలో సాలగ్రామ ట్రస్ట్ అధ్యక్షుడు సర్వశ్వరరావు, సరిపల్లి శ్రీరామచంద్రమూర్తి తదితరులు ఉన్నారు.

అన్నవరం: లయన్స్ క్లబ్ ఆఫ్ అన్నవరం ఆధ్వర్యంలో మట్టి గణపతి విగ్రహాలు ఇంటింటా పంపిణీ చేశారు. లయన్ డొంకాడ గిరి, మండల అధ్యక్షుడు పర్వత రాజాబాబు తదితరులు పాల్గొన్నారు.

ఏలేశ్వరం: పట్టణంలో బీజేపీ శ్రేణులు, లయన్స్ క్లబ్ సభ్యులు ఆధ్వర్యంలో మట్టి వినాయక విగ్రహాల పంపిణీ చేశారు. స్థానిక బాలాజీ చౌక్ సెంటర్‌లో బీజేపీ పట్టణాధ్యక్షుడు రెడ్డి లోవరాజు చేతుల మీదుగా సుమారు 500 మట్టి ప్రతిమలు పంపిణీ జరిగింది. కార్యక్రమంలో జిల్లా కార్యవర్గ సభ్యులు గట్టిం వెంకటరమణ, అలమండ దుర్గా ప్రసాద్, జ్యోతుల శ్రీనివాస్, గొల్లనూడి సత్యనారాయణ, గట్టిం సీతారం, గొల్లపల్లి త్రినాద్, రాతికింద కృష్ణారావు, ఉడతల రమణారావు, లింగం దుర్గబాబు తదితరులున్నారు.

'మట్టి విగ్రహాలనే పూజించాలి'

సర్పవరం జంక్షన్, సెప్టెంబరు 6: పర్యావరణ సమతుల్యతను కాపాడేందుకు మట్టితో తయారు చేసిన వినాయక విగ్రహాలను పూజించాలని ఎమ్మెల్యే పంతం నానాజీ కోరారు. శుక్రవారం గొడారిగుంటలో అడబాల ట్రస్ట్ అధ్యక్షుడు రత్నప్రసాదరావు ఆధ్వర్యంలో వినాయక వ్రత పుస్తకాలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ప్రసాద్ నాయుడు, రవిశంకర్, బి.సత్యనారాయణరాజు, సుబ్బారావు పాల్గొన్నారు.



పోర్టుసిటీ: మట్టి వినాయక బొమ్మల పంపిణీ



గొల్లప్రోలులో మట్టి విగ్రహాలతో విద్యార్థులు

శ్రీపాదవల్లభునికి సహస్ర గులాబి అర్చన



గులాబి అర్చన అనంతరం ప్రత్యేక అలంకారం

పిఠాపురం, సెప్టెంబరు 6: పిఠాపురంలోని శ్రీపాదశ్రీవల్లభ మహాసంస్థానంలో శ్రీపాదవల్లభ జయంతి సప్తాహ మహోత్సవాల్లో భాగంగా శుక్రవారం ఆరోరోజు సహస్ర గులాబి అర్చన నిర్వహించారు. శ్రీపాదవల్లభుడు, దత్తాత్రేయస్వామిలను విశేషంగా అలంకరించారు. మహన్యాస పూర్వక శత రుద్రాభిషేకం, సర్వపుష్ప పూజ, శ్రీసూక్త, పురుష సూక్తములతో సహస్ర నామార్చన, మంగళ హారతి, వేదపారాయణ, రుత్విక్కులచే దత్త మూలమంత్ర అనుష్టానము, గురుచరిత్ర పారాయణ, శ్రీపాద శ్రీవల్లభ చరితామృత పారాయణం జరిగాయి. శ్రీపాదవల్లభ మహాసంస్థానం కార్యనిర్వహణాధికారి సౌజన్య ఏర్పాట్లు పర్యవేక్షించారు.

వరద బాధితులకు నిత్యావసరాలు



శంఖవరం : సరుకులు తీసుకెళ్తున్న ఎన్టీఆర్ ఫ్యాన్స్

శంఖవరం, సెప్టెంబరు 6: విజయవాడ వరద బాధితుల కోసం ప్రత్తిపాడు నియోకవర్గ ఎన్టీఆర్ ఫ్యాన్స్ తారక్ సంక్షేమ సంఘం 3 టన్నుల బియ్యం, 600 లీటర్ల పాలు, నిత్యావసర సరుకులు అందించారు. జిల్లా కోఆర్డినేటర్ ఏవీఆర్, జిల్లా వైస్ ప్రెసిడెంట్ వాసంశెట్టి సూర్యఅర్జున్ లారీలో విజయవాడ పంపారు.

జగ్గంపేట: రంపయర్రంపాలెం గ్రామం నుంచి 3000 వాటర్ బాటిల్స్, 1500 బ్రెడ్ ప్యాకెట్లు, 1000 పాలు ప్యాకెట్లు పంపించడం జరిగింది. జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ సొంత వాహనాన్ని సమకూర్చారు. కార్యక్రమంలో రంపరాయల్స్ గ్రూప్ సభ్యులు, గ్రామపెద్దలు టీడీపీ సీనియర్ నాయకులు క్లస్టర్ ఉంగరాల రాము, గ్రామ సర్పంచ్ బాదంపూడి ప్రకాష్, గ్రామ టీడీపీ అధ్యక్షుడు సత్యం పెద్దబ్బులు, జనసేన సీనియర్ నాయకులు గుల్లింకల నాని, నవనాసి విష్ణు, నూరపురెడ్డి రామకృష్ణ, పంతం వీరబాబు ఉన్నారు.

ఎక్స్‌గ్రేషియా చెక్కుల అందజేత



కాకినాడ సిటీ, సెప్టెంబరు 6: విజయవాడలో వరదల్లో మృతి చెందిన బాధిత కుటుంబాలకు ఒక్కొక్కరికి రూ.5లక్షల చొప్పున ఎక్స్‌గ్రేషియా చెక్కులను కాకినాడ సిటీ ఎమ్మెల్యే వనమాడి కొండబాబు అందజేశారు. టీడీపీ సెంట్రల్ నియోజకవర్గ కార్యాలయంలో విజయవాడ సెంట్రల్ ఎమ్మెల్యే బోండా ఉమామహేశ్వరరావు, కొండబాబు పాల్గొన్నారు.

సీఎం సహాయనిధికి విరాళం

పిఠాపురం, సెప్టెంబరు 6: వరదల కారణంగా నష్టపోయిన బాధితులకు అండగా నిలిచేందుకు ముఖ్యమంత్రి సహాయ నిధికి పిఠాపురం నియోజకవర్గ బీజేపీ ఇన్‌చార్జి డాక్టర్ బుర్రా కృష్ణంరాజు రూ.50వేలు విరాళంగా ప్రకటించారు. కార్యక్రమంలో పలువురు బీజేపీ నేతలు పాల్గొన్నారు.

గోశాలల నిర్మాణానికి సహకారం



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే నెహ్రూ

జగ్గంపేట, సెప్టెంబరు 6: నియోజకవర్గంలో రైతులకు అధిక మొత్తం రుణాలు మంజూరు చేసి గోశాలల నిర్మాణానికి సహకరించాలని ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ ఆదేశించారు. రావులమ్మనగర్‌లో ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నియోజకవర్గంలోని 4మండలాల ఎంపీడీవోలు, వెటర్నరీ వైద్యులు, ఉపాధిహామీ పథకం ఏపీవోలు, ఈసీలు, టెక్నికల్ అసిస్టెంట్లతో నెహ్రూ రివ్యూ మీటింగ్ నిర్వహించారు. నియోజకవర్గంలో గోశాలల ఏర్పాటుకు ప్రభుత్వం నుంచి అనుమతి తీసుకువస్తానని, రైతులకు అన్ని విధాలా సహకరించాలన్నారు. నాలుగు మండలాల వెటర్నరీ వైద్యులు, ఉపాధి హామీ సిబ్బంది ఉన్నారు.

భారీ వర్షాలకు రత్నగిరిపై విరిగిపడిన కొండచరియ



అన్నవరం, సెప్టెంబరు 6: ఇటీవల కురుస్తున్న భారీ వర్షాలకు రత్నగిరిపై కొండచరియ విరిగిపడింది. శుక్రవారం రాత్రి ఆదిశంకర్ మార్గ్‌లో జరిగిన ఈ సంఘటనలో ఎవరికి ఎటువంటి ప్రమాదం సంభవించలేదు. కొండచరియ విరిగి డ్రైనేజీ అనుకునిపడగా చిన్నచిన్న రాళ్లు రోడ్డుకు అడ్డంగా పడిఉన్నాయి. అధికారులు హుటాహుటిన వీటిని తొలగింపు చర్యలు చేపట్టారు. కొండచరియలు విరిగిపడకుండా ఉండేందుకు గతంలో సాంకేతిక నిపుణుల బృందం వచ్చి పలు సూచనలు చేశారు. ఆదిశంకర్ మార్గ్‌లో రాకపోకలను తాత్కాలికంగా నిలుపుదల చేశారు.

దొంగతనం కేసులో జైలు శిక్ష

కిర్లంపూడి, సెప్టెంబర్ 6: 2023లో జరిగిన కిర్లంపూడి మండలంలో గల వివిధ ట్రాన్స్‌ఫార్మర్ల దొంగతనం కేసులో ఏ1 ద్వారం రవిప్రసాద్‌కు ఏడాది జైలు శిక్ష, మరో ఇద్దరికి రూ.2వేలు జరిమానా విధిస్తూ ప్రత్తిపాడు జేఎఫ్‌సీఎం కోర్టు మేజిస్ట్రేట్ శుక్రవారం తీర్పు నిచ్చారు. ఈ కేసులో ప్రభుత్వం తరఫున ప్రత్తిపాడు కోర్టు ఏపీపీ ఇ.మణికంఠకుమార్ వాదనలు వినిపించారు. ఈ కేసులో సాక్షులను కోర్టులో హాజరుపరిచిన కోర్టు పీసీ శీను కిర్లంపూడి ఎస్ఐ సతీష్ అభినందించారు.

ప్రతీ మంగళవారం డొక్కా సీతమ్మ క్యాంటీన్

జగ్గంపేట, సెప్టెంబరు 6: జగ్గంపేటలో ఇటీవల డొక్కా సీతమ్మ క్యాంటీన్‌ను జగ్గంపేట జనసేన ఇన్‌చార్జి తుమ్మలపల్లి రమేష్ ప్రారంభించారు. ప్రతీ సోమవారం జగ్గంపేటలో టీడీపీ అన్న క్యాంటీన్‌ను నిర్వహిస్తుందన, ప్రతీ మంగళవారం జగ్గంపేట పాత పోలీస్‌స్టేషన్ ఆవరణలో డొక్కా సీతమ్మ క్యాంటీన్‌ను నిర్వహించనున్నారు.

ఘనంగా ఉపాధ్యాయ దినోత్సవం

పెద్దాపురం, సెప్టెంబరు 6: స్థానిక రామారావుపేటలో ఉన్న శ్రీప్రకాష్ సినర్జీస్ పాఠశాలలో ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. పాఠశాల డైరెక్టర్ సీహెచ్ విజయ్‌ప్రకాష్ డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. పాఠశాల ప్రొఫెసర్ సంతానం, సీనియర్ ప్రిన్సిపాల్ యంవీవీఎస్ మూర్తి మాట్లాడారు. ఉపాధ్యాయులు ప్రదర్శించిన సామూహిక చర్చ, గీతాలాపన, నృత్యప్రదర్శనలు, లఘునాటికలు ఆకట్టుకున్నాయి. శ్రీప్రకాష్ సినర్జీస్ పాఠశాలలో వినాయక చవితి పండుగను పురస్కరించుకుని మట్టి వినాయక ప్రతిమలను పాఠశాల ఆవరణలో విద్యార్థులు తయారుచేశారు.

భూ ఆక్రమణలపై విచారణ నిర్వహించాలి

మాజీ మంత్రి యనమల రామకృష్ణుడు



అధికారులతో సమీక్షిస్తున్న యనమల

తుని రూరల్, సెప్టెంబరు 6: గత వైసీపీ పాలనలో అడ్డుగోలుగా దోచుకున్న భూ ఆక్రమణలపై సమగ్ర విచారణ నిర్వహించి గత పాలకుల అవినీతిని నిగ్గు తేల్చాలని మాజీ మంత్రి యనమల రామకృష్ణుడు రెవెన్యూ అధికారులను ఆదేశించారు. తేటగుంట టీడీపీ కార్యాయలంలో పెద్దాపురం ఆర్డీవో సీతారామారావు, తుని, తొండంగి, కోటనందూరు మండల తహశీల్దార్లతో నియోజకవర్గంలో పలు భూ అవకతవకలపై సమీక్ష నిర్వహించారు. తొండంగి మండలం కోదాడలో ఉప్పుటేరు ట్యాంక్ ఆక్రమణపై స్థానికుల ఫిర్యాదు మేరకు నిజ నిర్ధారణ కమిటీ నిర్వహించి వాస్తవాలను సేకరించామని, ఉప్పుటేరు గర్భంలో ఉన్న చేపల చెరువుల లైసెన్సులు తక్షణం రద్దు చేయాలని ఆదేశించారు. సాగు, తాగునీరు అవసరాలకనుగుణంగా ఉప్పుటేరును వినియోగించాలన్నారు. తుని పట్టణానికి సంబంధించి వైసీపీ ప్రభుత్వం రాజుపేటలో కొనుగోలు చేసిన వందల ఎకరాల్లో భూముల్లో కోట్లాది రూపాయల అవినీతికి పాల్పడినట్లు ప్రజల నుంచి పెద్ద ఎత్తున ఆరోపణలు వస్తున్నాయని సంబంధిత లావాదేవీలు లేఅవుట్ల పంపిణీ వ్యవహారంపై సమగ్రమైన విచారణ చేపట్టాలని కోరారు. మరోవైపు ఎస్ఈజెడ్ భూముల వ్యవహారాన్ని ప్రస్తావించి రైతులు, పరిశ్రమల ప్రతినిధులతో సంప్రదింపులు జరిపి వారి మధ్య సఖ్యత ఉండేలా అధికారులు చొరవతీసుకోవాలని ఆయన కోరారు.

'గర్భిణులు, బాలింతలు పౌష్టికాహారం తీసుకోవాలి'



కిర్లంపూడి: తామరాడలో మాట్లాడుతున్న సీడీపీవో

కిర్లంపూడి, సెప్టెంబరు 6: గర్భిణులు, బాలింతలు పౌష్టికాహారం తీసుకోవాలని జగ్గంపేట సీడీపీవో ఎం.పూర్ణిమ అన్నారు. శుక్రవారం మండలంలోని తామరాడ గ్రామ ఆంజనేయస్వామి ఆలయంలో పౌష్టికాహార మాసోత్సవాల కార్యక్రమం సర్పంచ్ తోట అయ్యన్న అధ్యక్షతన జరిగింది. సీడీపీవో మాట్లాడుతూ తక్కువ ఖర్చుతో ఎక్కువ పోషకాలు కలిగిన ఆహారం తీసుకోవాలన్నారు. సెప్టెంబర్ 30వతేదీ వరకు పౌష్టికాహార మాసోత్సవాలు జరుగుతాయన్నారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ పి.బూసమ్మ, ఎంపీటీసీ గోకేడ రాజా, మాజీ సర్పంచ్ అనుకుల శ్రీకాంత్, మాజీ ఎంపీటీసీ పంచాది నానాజీ, సెక్రటరీ పెద్దకాపు, పసుపులేటి శివగంధం పాల్గొన్నారు.

కొత్తపల్లి: గర్భిణీలు, బాలింతలు క్రమం తప్పకుండా ప్రభుత్వం ద్వారా అందిస్తున్న పౌష్టికాహారాన్ని భుజించాలని ఐసీడీఎస్ కొత్తపల్లి సెక్టార్ సూపర్‌వైజర్ యువీవీ అనంతలక్ష్మి కోరారు. కుతుకుడుమిల్లి 94కోడ్ అంగన్‌వాడీ కేంద్రంలో పౌష్టికాహార మాసోత్సవాలపై గర్భిణులు, బాలింతలకు అవగాహన కల్పించారు. అంగన్‌వాడీ వర్కర్ విజయదుర్గ, ఆయా దుర్గా భవాని, ఎంఎల్‌హెచ్‌పీ షణ్ముకి, ఆశావర్కర్ రజని ఉన్నారు.

సామర్లకోట: హుస్సేన్‌పురంలో పెద్దాపురం ఐసీడీఎస్ ప్రాజెక్ట్ సీడీపీవో జీ.ఉషా సూపర్‌వైజరు నిర్మలా కుమారి, అంగన్‌వాడీ సిబ్బంది పౌష్టికాహార మాసోత్సవాలపై ప్రచారం నిర్వహించారు. గర్భిణులు, బాలింతలు, కిశోరబాలికలకు రాగిపిండి, గుడ్లు, వేరుశెనగ చిక్కీలు, పాలు, ఖర్జూరాన్ని అంగన్‌వాడీ సిబ్బంది అందజేశారు.

పీఆర్ కళాశాలకు న్యాక్ బీ++ గ్రేడ్

కాకినాడ రూరల్, సెప్టెంబరు 6: కాకినాడ పీఆర్ ప్రభుత్వ అటానమస్ డిగ్రీ కళాశాలకు న్యాక్ బీ++గ్రేడ్‌ను ప్రకటించింది. అయితే 2017లో డాక్టర్ చప్పిడి కృష్ణ ప్రిన్సిపాల్‌గా ఉన్నప్పుడు కళాశాలకు న్యాక్ ఏ గ్రేడ్ హోదానిచ్చింది. ఇది 2022 వరకూ కొనసాగింది. గత నెల 29,30 తేదీల్లో ముగ్గురు సభ్యులతో కూడిన న్యాక్ బృందం కళాశాలకు వచ్చి అన్ని విభాగాలను పరిశీలించింది. 2.82 సీజీపీఏ పాయింట్లు సాధించడంతో కేవలం న్యాక్ బీ++ గ్రేడ్‌తో సరిపెట్టుకోవాల్సివచ్చింది. కళాశాలకు గతంలో ఉన్న ఏ గ్రేడ్ నుంచి బీ++ గ్రేడ్‌కు హోదా తగ్గిపోవడం గమనార్హం. దీనిపై ప్రిన్సిపాల్ తిరుపాణ్యంను వివరణ కోరగా కళాశాల్లో పరిశోధనలు, ప్లేస్‌మెంట్స్ తక్కువగా ఉన్నాయని దీంతో న్యాక్ బీ++ గ్రేడ్ మాత్రమే లభించిందని, ఈహోదా ఐదేళ్ల వరకూ ఉంటుందన్నారు.

గురుకులాన్ని తనిఖీ చేసిన జూనియల్ సివిల్ జడ్జి

ఏలేశ్వరం, సెప్టెంబరు 6: ఏలేశ్వరంలో డాక్టర్ బీఆర్. అంబేడ్కర్ గురుకుల బాలికల పాఠశాల, కళాశాలను శుక్రవారం ప్రత్తిపాడు కోర్టు ఇంచార్జ్, జూనియర్ సివిల్ జడ్జి బుల్లెమ్మ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఇటీవల సుమారు 89 మంది బాలికలు కలుషిత ఆహారం తిని అనారోగ్యం పాలవ్వడంతో గురుకుల విద్యార్థినులకు సెలవులు ప్రకటించారు. ఈ నేపథ్యంలో హైకోర్టు ఆదేశాల మేరకు జడ్జి బుల్లెమ్మ పాఠశాల, కళాశాల విద్యార్థులు, ఉపాధ్యాయుల హాజరు పట్టీ, వసతి గృహం, వంటశాల స్టాక్ రిజిష్టర్‌లు పరిశీలించారు. 605మంది విద్యార్థినులకు 16మంది బాలికలు ఉండగా వారి ఆరోగ్యం పరిస్థితి, విద్యపై ఆరా తీశారు. వసతి గృహం, హాస్టల్‌లో తాగు నీరు, పలు సదుపాయాలు సమకూర్చాలని ప్రిన్సిపాల్ చంద్ర శారదకు ఆదేశాలు జారీ చేశారు. అల్పాహారం, భోజనం మెనూప్రకారం అందజేయాలన్నారు. ఎప్పటికప్పుడు క్లాసు రూములు, వసతిగృహం, వంటశాలను పరిశుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు.

